# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రేపు ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశంలో తెలియజేసింది.
- ❖ యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని కేంద్ర మంత్రి జైశంకర్ అన్నారు.
- ❖ కృత్రిమ మేధకు సంబంధించిన ప్రాధమిక నమూనాను రూపొందించనున్నట్టు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- ❖ కార్మిక వర్గాలకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు.

============================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రేపు ప్రారంభం కానున్న నేపధ్యంలో ఈరోజు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు కేంద్ర మంత్రులు, వివిధ పార్టీ ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిల పక్షానికి అందించింది. బడ్జెట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్టు, దీనితో పాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది.

============================

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈరోజు ఢిల్లీ యూనివర్సిటీలో వివిధ కళాశాలల విద్యార్థులతో వికసిత్ భారత్ అంశంపై సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన... యువత లేకుండా వికసిత్ భారత్‌ను ఊహించలేమని అన్నారు. వివిధ రంగాల్లో రాణించాలంటే యువతకు విద్యతో పాటు సృజనాత్మక స్వేచ్ఛను అందించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. విద్యార్థులు తమ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. యువత భవిష్యత్తులో సాధించవలసిన లక్ష్యాలు చాలా ఉన్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కార్మిక మంత్రులు, కార్యదర్శుల జాతీయ స్థాయి సమావేశం న్యూఢిల్లీలో 2 రోజుల పాటు జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా అధ్యక్షత వహించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు ప్రయోజనం చేకూరేలా చేపట్టే సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేయడానికి కేంద్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. రోజు కూలీలు, నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పెన్షన్, ఆరోగ్య సంరక్షణ, జీవిత, ప్రమాద బీమా, సమగ్ర, సుస్థిర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

==========================

వచ్చే నెల 1వ తేదీన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో వరల్డ్ బుక్ ఫెయిర్ 2025 ప్రారంభం కానుంది. 9 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం 75 సంవత్సరాల జ్ఞాపకార్థం “We the People of India” అనే ఇతివృత్తంతో బుక్‌ఫెయిర్ నిర్వహిస్తున్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ యువరాజ్ మాలిక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ… ఈ సంవత్సరం ఫ్రాన్స్, అర్జెంటీనా, స్పెయిన్, కొలంబియా, అబుదాబి, ఖతార్ తదితర 50కి పైగా దేశాలు పాల్గొంటాయని చెప్పారు. ఈ మేళాకు సుమారు 2 వేల మంది ప్రచురణకర్తలు, వెయ్యి మంది వక్తలు హాజరవుతారని తెలియజేశారు.

==========================

ఎఫ్ఐఆర్ దాఖలు చేసినప్పటి నుండి 3 సంవత్సరాలలోపు న్యాయాన్ని అందించాలనే నిబంధన మూడు నూతన నేర చట్టాల్లో ప్రధానాంశమని హోం మంత్రి అమిత్ షా అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో ఈ చట్టాల అమలుపై ఆయన ఈరోజు న్యూఢిల్లీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గుజరాత్‌లో పోలీసులు, జైళ్ళు, కోర్టులు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్‌లకు సంబంధించిన వివిధ కొత్త నిబంధనల అమలు, వాటి ప్రస్తుత స్థితిని సమీక్షించారు. 2025 ఏప్రిల్ 30 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా త్వరగా కొత్త నేర చట్టాలు అమలు జరిగేలా గుజరాత్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

విరామం

==========================

భారత దేశ కృత్రిమ మేధకు సంబంధించిన నమూనాను త్వరలో రూపొందించనున్నామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ… ఈ నమూనా ప్రపంచంలోని అత్యుత్తమ నమూనాలతో పోటీ పడగలదన్నారు. త్వరలోనే ఏ.ఐ. సేఫ్టీ ఇన్‌స్టిట్యూషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. దేశంలో ప్రస్తుతం 15 వేల హై-ఎండ్ GPUలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధునిక సాంకేతికత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ ఈ సందర్భంగా తెలియజేస్తూ….

(వాయిస్ 25 సెకన్లు)

==========================

యమునా నదిని విషపూరితం చేశారన్న ఆరోపణలకు సంబంధించి నిర్దిష్టమైన సమాధానం ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆమ్ ఆద్మీ పార్టీని ఆదేశించింది. ఆ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ… రేపు ఉదయం లోపు సమాధానాన్ని తెలియజేయాలని సూచించింది. హర్యానా ప్రభుత్వం యమునా నదిలో విషం కలిపిందన్న కేజ్రీవాల్ వ్యాఖ్యలపై స్పందిస్తూ… ఎలాంటి విషం కలిపిందో తెలియజేయాలని స్పష్టం చేసింది. యమునా

నదిలో అమ్మోనియా స్థాయిలు పెరగడం గురించి కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... ఢిల్లీ జల్ బోర్డ్ ఏ ప్రాతిపదికన నిర్ధారించిందని, ఎవరు కనుగొన్నారని, ఎక్కడ గుర్తించారని తెలియజేయాలని ఆదేశించింది.

============================

కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన తరువాత మహాకుంభ్‌లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు ఉత్తరప్రదేశ్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఈరోజు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించారు. ఈ ఘటనలో 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో 60 మంది గాయపడ్డారు. గాయపడిన వారు ప్రస్తుతం స్థానిక వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన తరువాత ప్రభుత్వం కుంభమేళా ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసింది.

============================

వక్ఫ్ ఆస్తులకు జియో మ్యాపింగ్ ప్రారంభించాలని నిర్ణయించామని మహారాష్ట్ర మైనారిటీల అభివృద్ధి శాఖా మంత్రి దత్తాత్రేయ భరణే తెలిపారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై పార్లమెంటరీ కమిటీ నివేదికను అందజేయనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణలకు గురైన భూములు, కొలతలు వేయని భూముల ప్రస్తుత స్థితిని తెలుసుకునేందుకు, రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి ఆస్తుల జియో మ్యాపింగ్ సర్వేను త్వరలో ప్రారంభించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

============================

జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా బలగాలు సమష్టిగా పని చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) నళిన్ ప్రభాత్ కోరారు. ఈరోజు ఆర్మీ, CRPF, జమ్ము కశ్మీర్ పోలీసు ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడుతూ... భద్రతా దళాలు సమన్వయంతో పని చేస్తూ... ఆ ప్రాంతంలో ఉగ్రవాద చర్యలను నివారించాలని అన్నారు. ప్రత్యేక బృందాల సంకల్పం, చురుకైన విధానాలను ఆయన అభినందించారు. అనంతరం పోలీసు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ అధికారులతో కలిసి కథువా జిల్లాలోని పలు ప్రాంతాల్లో డీజీపీ పర్యటించారు.

============================

బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజేత కిదాంబి శ్రీకాంత్ ఈరోజు థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరుగుతున్న థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించారు. ప్రపంచ 47వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-19, 21-15తో హాంకాంగ్‌కు చెందిన జాసన్ గుణవాన్‌పై వరుసగా రెండు గేమ్‌లలో విజయం సాధించారు.

కాగా మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో భాగంగా భారత్ రేపు ఇంగ్లాండ్‌తో ఆడనుంది. ఐసీసీ టోర్నీలో ఇప్పటి వరకు టీమిండియా వరుస విజయాలతో సెమీ ఫైనల్ వరకు చేరింది.

============================

ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్ - 22 లోని ఛట్‌నాగ్ ఘాట్‌వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, సుమారు 15 గుడారాలు మంటల్లో దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. కాగా... ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, ఎవరూ గాయపడలేదని స్థానిక అధికారులు తెలిపారు.

============================

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను, అలాగే మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను భారతీయ జనతా పార్టీ తప్పక అమలు చేస్తుందన్నారు. ఢిల్లీలో ఈసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ... ఎన్నికలలో లబ్ధిపొందేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీపై అసత్య వ్యాఖ్యలు చేస్తోందని ఆరోపించారు.

==============================

==============================